క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

దొనకొండ: మండలంలోని బాదాపురం జనరల్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి కుకింగ్ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలందించారు.

తాళ్లూరు: మండలంలోని రమణాలవారిపాలెం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య బుధవారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విద్యార్థుల పురోగతి, లెసన్ ప్లానింగ్, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, సీఆర్పీ శాంతి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి

కంభం: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో లక్ష్యం వైపు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తే విజయం సాధించి తీరుతారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఎల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ రామకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడనాడి పట్టుదలతో చదువుపై దృష్టి సారించాలన్నారు. తరగతి గదిలో విన్న పాఠాలను మిత్రులతో చర్చించుకోవడం ద్వారా మరుపు అన్నది రాదన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు పులి శ్రీనివాస ప్రసాద్, మహబూబ్ బేగ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇంటి నిర్మాణానికి చేయూత



రుణం అందిస్తున్న రమేష్

మార్కాపురం టౌన్: జగనన్న ఇంటి నిర్మాణానికి వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని ఏపీఎం రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన వేములపేటలో 35 వేల రూపాయల రుణాన్ని పొదుపు గ్రూపుల ద్వారా అందించారు. ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేయాలన్నారు.

27న విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికలు

మార్కాపురం టౌన్: మార్కాపురం విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, టి. జయరామ్ తెలిపారు. ఎన్నికల అధికారిగా టీసీహెచ్ సుబ్బారావును, సహాయ ఎన్నికల అధికారిగా ఎం.భాస్కర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. నామినేషన్ 27 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల్లోపు వేయాలని సూచించారు.

నేడు మెగా వైద్య శిబిరం

తాళ్లూరు: స్థానిక మండల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సహకారంతో కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర ప్రారంభిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి కోరారు.

త్రిపురాంతకేశ్వరస్వామి ఆదాయం రూ.18.98 లక్షలు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం, బాలత్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రెండు నెలల మూడు రోజులు త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం ద్వారా రూ.9,22,160 లక్షలు, బాలత్రిపురసుందరీదేవి అమ్మవారి ఆలయం ద్వారా రూ.9,76,701 లక్షలు మొత్తం రూ.18,98,861 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, చైర్మన్ పబ్బిశెట్టి పద్మజా మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పప్పు శనగ సాగుపై రైతుల ఆసక్తి

● రబీలో 4,560 హెక్టార్లలో సాగు



పప్పు శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీ (ఫైల్)

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం సబ్ డివిజన్‌లో ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పప్పు శనగ సాగుపై ఆసక్తి చూపారు. పప్పుశనగ సాగుకు ఈ ప్రాంత నేలలు అనుకూలంగా ఉండటంతో మొగ్గు చూపుతున్నారు. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల్లో మొత్తం 4,560 హెక్టార్లలో సాగు చేశారు. మార్కాపురం మండలంలో 955 హెక్టార్లు, తర్లుపాడులో 908.7 హెక్టార్లు, పెద్దారవీడులో 22.25 హెక్టార్లు, కంభంలో 1624.4 హెక్టార్లు, అర్ధవీడులో 1050 హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. తక్కువ పెట్టుబడి కావడంతో పాటు కేవలం మంచుతోనే పంట పండుతుంది. దీంతో పలువురు రైతులు పప్పుశనగ దిగుబడులపై ఆశలు పెంచుకుంటున్నారు. జేజీ-2 రకం, క్రాంతి, శ్వేత, అన్నెగిరి తదితర రకాలు సాగు చేశారు. వర్షాధార పంటగా, వర్షాకాలంలో మంచుతో శనగ సాగు అవుతుంది. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో 200 ఎకరాలు, ఎల్‌బీఎస్ నగర్‌లో 180, భూపతిపల్లి, బోందలపాడు, వేములకోట, నికరంపల్లె, మిట్టమీదపల్లె, బొందలపాడు, కొండేపల్లి, చింతగుంట్ల తదితర ప్రాంతాల్లో రబీ సీజన్‌లో పప్పు శనగను సాగు చేశారు. తర్లుపాడు మండలం సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జాపేట, సూరెపల్లి తదితర గ్రామాల్లో సాగు చేశారు.

ఎకరాకు రూ.12 వేలు ఖర్చు

పప్పుశనగ సాగు వ్యయం దాదాపు ఎకరాకు 12 వేల రూపాయల వరకు పెట్టుబడుల రూపంలో రైతులు ఖర్చు చేశారు. విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, సేద్యానికి ఖర్చు పెట్టినట్లు రైతులు తెలిపారు. ఎకరాకు దాదాపు 6 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావొచ్చని అంచనాలు వేస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.5,335 ప్రకటించింది.

త్వరలో కొనుగోలు కేంద్రాలు



రైతులు దళారుల మాటలు నమ్మి గ్రామాల్లో పప్పుశనగ అమ్ముకోవద్దు. వచ్చే నెల మొదటి వారంలో మార్కాపురం మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం క్వింటాకు 5,335 రూపాయలు మద్దతు ధర ప్రకటించింది. 14 తేమ శాతం ఉండాలి. విత్తనాలు బాగా ఆరబెట్టాలి. మట్టి లేకుండా చూసుకోవాలి.

– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏడీ మార్కాపురం

అధికారులు బాధ్యతగా పని చేయాలి

● ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ

కొనకనమిట్ల: ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా అధికారులు పని చేసి మంచి పేరు తీసుకురావాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, గ్రామ పంచాయతీల ప్రజా ప్రతినిధులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను తిప్పుకోకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు పార్టీలకు అతీతంగా ప్రజలకు చేరువయ్యేలా, అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, విద్య, వైద్యం, హౌసింగ్, ఉపాధి, వైఎస్సార్ క్రాంతి పథం, అంగన్‌వాడీ శాఖల తరఫున ఆయా శాఖల అధికారులు ప్రసన్న రంగలక్ష్మి, డాక్టర్ పృధ్వీరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, దాంగే షరీఫ్, శ్రీనివాసరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, సుధామాలతిలు తమ శాఖల తరఫున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు.

అధికారుల పనితీరుపై ధ్వజమెత్తిన సభ్యులు

పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ముఖ్యంగా గత సమావేశంలో వెల్లడించిన సమస్యలపై పలువురు అధికారులు స్పందించలేదని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆరోపణలు చేశారు. రెవెన్యూ సమస్యలు, నాడు-నేడు పనులు, విద్యాశాఖ, విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలు విన్నవించినా మాకేంటి అన్నరీతిలో అధికారుల పనితీరుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సభ్యులు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా, ఎంపీడీఓ రావూరి జనార్దన్, తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు, కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్‌లు కాముసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వలి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, ఎంపీటీసీ కల్లం దిబ్బమ్మ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

కొమరోలు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అభివృద్ధి పనులను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు బుధవారం ప్రారంభించారు. ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజకు ఆర్యవైశ్య ప్రముఖులు ఆహ్వానించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, దేవాలయ అధ్యక్షుడు వెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జలకొండ వెంకటేశ్వర్లు, రమణయ్య, ఆర్యవైశ్య ప్రముఖులు సుబ్బారావు, రంగయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

పొదిలి రూరల్: పొదిలి నగర పంచాయతీలోని కాటూరివారిపాలెం సచివాలయం-6ను బుధవారం డీఆర్‌డీఏ జిల్లా సహాయ ప్రాజెక్టు అధికారి జీవీ వరప్రసాద్ సందర్శించారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెన్షన్ కానుక రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. వలంటీర్లు ప్రతి అబ్ధిదారుని ఇంటికి వెళ్లి సకాలంలో పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

బృంగీశ్వర వాహనంపై ఆదిదంపతులు



జటాఝూటం అలంకారంలో శంకరుడు

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో స్వామివారు బుధవారం జటాఝూటం అలంకారంపై పార్వతీ పరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, అమ్మవారికి అర్చన చేశారు. నాలుగు మాడ వీధుల్లో స్వామి వారి ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. శివాలయంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు. చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, సాయిబాబా మందిరం ఫౌండర్ గోపాలుని హరిహరరావు, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు, ధర్మకర్తలు, శేషగిరిరావు, అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ పాల్గొన్నారు.

ఆరుతడి పంటగా నువ్వులు లాభదాయకం



రైతులకు వివరిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు: వేసవి ఆరుతడి పంటగా నువ్వుల సాగు లాభదాయకమని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బెల్లంకొండవారిపాలెంలో నువ్వుల సాగుపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రానున్న వేసవి వాతావరణంలో చీడ పీడల బెడద తక్కువగా ఉండి విత్తన శుద్ధి నాణ్యత పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. నీరు నిలువని తేమ నిలిచే నేలలు శ్రేష్ఠంగా ఉంటాయన్నారు. గౌరి, మాధవి, యలమంచిలి రకాలు మన నేలకు బాగా సరిపోతాయన్నారు. కిలో విత్తేందుకు మూడు గ్రాముల థైరంతో విత్తన శుద్ధి చేసుకుని విత్తుకోవాలని తెలిపారు. వీఏఏ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ముండ్లమూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను కొంత మేర అరికట్టవచ్చని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఆటో యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆటోలను గుర్తించి వరుస క్రమంలో నంబర్లు కేటాయించారు. పోలీసులు కేటాయించిన స్టిక్కర్లను ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. మద్యం తాగి ఆటో నడిపితే జైలుకు పంపుతామని ఎస్ఐ హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలు అరికట్టేందుకు సహకరించాలని కోరారు. కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మరియబాబు, అంకారావు, శ్రీనివాసరావు, అంజిబాబు, మహేష్, సూరిబాబు, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న బాలికలు

కురిచేడు: మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 5వ వార్షికోత్సవం బుధవారం విద్యార్థులు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన వార్షికోత్సవంలో బాలికలు నృత్యాలు చేసి అలరించారు. యోగాతో యోగ్యత కలుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయుడు అసుల వెంకటస్వామి తెలిపారు. తాను ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన విద్యార్థులతో యోగా చేయించారు. మండల విద్యాశాఖాధికారి వస్త్రాంనాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు దిశానిర్దేశం చేసేది 10వ తరగతి పరీక్షలన్నారు. అందరూ కష్టపడి చదివి అధిక మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఉన్నత చదువులు చదివి జీవితాశయాన్ని చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు అంకయ్య సూచించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, కృష్ణ, రహంతుల్లా, కోటేశ్వరరావు, బాషా, ఎస్‌వీ ఎల్.సుబ్బారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పుల్లలచెరువు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జూపూడి మంగాదేవి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు నియంత్రించొచ్చు



మాట్లాడుతున్న ఎస్ఐ సంపత్‌కుమార్

ముండ్లమూరు: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలను నియంత్రించవచ్చని ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం సర్పంచ్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రధాన ప్రదేశాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగ పడతాయన్నారు. వెంటనే నిందితులను గుర్తించవచ్చన్నారు. పంచాయతీ నిధుల నుంచి అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు వేముల పద్మావతి శ్రీనివాసరావు, నలమోలు వెంకటేశ్వర్లు, చొప్పరపు వెంకటేశ్వర్లు, కందిమల్ల గీతాంజలి, గజ్జల సుబ్బారెడ్డి, ఆదెమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధన కరువు

● ఉపాధ్యాయులు లేక ఆడుకుంటున్న విద్యార్థులు

రాచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నా ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో సకాలంలో విద్యార్థులకు విద్యాబోధన అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో క్లాసులకు వెళ్లపోవడంతో విద్యార్థులు ఎండలో ఆడుకుంటూ క్లాస్ రూమ్‌ల్లో ఖాళీగా కూర్చుంటున్న సంఘటనలు మండలంలోని రాచర్ల, అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్నాయి. అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న మొత్తం 16 మంది విద్యార్థులు ఉన్నారు. బుధవారం ఫస్ట్ పీరియడ్ మాత్రమే నిర్వహించి విద్యార్థులను పూర్తిగా వదిలేయడంతో క్లాస్ రూమ్‌లో పుస్తకాలు పెట్టి బయట ఎండలో ఆడుకుంటున్నారు. అంతేగాక రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3వ, 4వ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులకు కేవలం తెలుగు క్లాస్ నిర్వహించి వదిలేశారు. గదిలో విద్యార్థులు కేకలు వేస్తూ ఆడుకుంటున్నారు. విద్యార్థులతో మాట్లాడగా కేవలం ఒక క్లాస్ మాత్రమే జరిగిందని, యోగా, పీఈటీ టీచర్లు రాలేదని, అందుకే ఖాళీగా కూర్చున్నామని తెలిపారు.

ఉపాధి పనులు పెద్ద ఎత్తున చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ భాస్కర్‌రావు

తర్లుపాడు: ఉపాధి హామీ పనులు పెద్ద ఎత్తున చేపట్టి ఎక్కువ పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఏపీడీ భాస్కర్‌రావు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ పనులు ముగుస్తున్న నేపథ్యంలో ప్రతి జాబ్ కార్డుదారునికి వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. 257 రూపాయలు కూలి తగ్గకుండా దగ్గరుండి పని కల్పించాలని సూచించారు. లబ్ధిదారుడి అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకునేందుకు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయాలన్నారు. ఏపీఓ జీవరత్నం, ఈసీ పెద్దన్న పాల్గొన్నారు.

రైళ్లపై దాడులు చేస్తే కఠిన చర్యలు

మార్కాపురం టౌన్: కదులుతున్న ట్రైన్‌లపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రంలో పలువురు రైళ్లపై రాళ్లు వేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఆయన రాయవరం, ఎస్సీ కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాక్‌పై వివిధ రకాల వస్తువులు ఉంచడం చేయవద్దన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. అనుమతి లేని ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ దాటొద్దన్నారు. కానిస్టేబుల్ చారీ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొమరోలు: రహదారి ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి కొమరోలు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని చింతలపల్లి రహదారి ప్రమాదంలో భర్తను కోల్పోయి నిరాశ్రయురాలిగా మారిన మహిళకు బుధవారం ఆర్థిక సాయాన్ని చింతలపల్లె యూత్ ఆధ్వర్యంలో అందజేశారు. ఇటీవల హనుమంతరాయునిపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటస్వామి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చింతలపల్లి యూత్ ఆధ్వర్యంలో వెంకట స్వామి భార్యకు రూ.2 లక్షలు సేకరించి అందజేశారు. ఆ నగదును బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ జనార్దన్ నాయుడు బాధితురాలికి అందజేశారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీస్ ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు బుధవారం నుంచి కొత్తగా బస్సు సరీస్సు నడపనున్నట్లు మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సింహులు తెలిపారు. పెద్దదోర్నాలలో రాత్రి 9 గంటలకు బయలుదేరే సెమీ లగ్జరీ బస్సు కుంట, యర్రగొండపాలెం, మాచర్ల మీదుగా హైదరాబాద్ చేరుకుంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో సైతం టికెట్‌లు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ డీలర్‌పై కేసు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో 43వ చౌక దుకాణంలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్ తనిఖీ నిర్వహించారు. ఫిబ్రవరిలో 645 రేషన్ కార్డులకు 60 మందికి మాత్రమే రేషన్ అందించినట్లు గుర్తించడంతో డీలర్ శ్రీధర్‌పై కేసు నమోదు చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అమెరికన్ అంకాలజీ పెదకాకాని ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 25 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నిపుణులు రాధా మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఎలా వస్తుంది, నివారణా చర్యలపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానం వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు జ్యోతి, జాస్మిన్, సీహెచ్ఓ నారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ నాగార్జున, ఫార్మసిస్టు యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాధ